తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 2- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 59 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## పెద్దసూరారంలో అభివృద్ధికి ఊతం

- అభివృద్ధి పనులను సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి
- సబ్‌స్టేషన్, సీసీ రోడ్లకు కీలక ప్రకటనలు
- మహిళా సంఘాలకు రూ.2.5 కోట్ల రుణాలు
- ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశం

**నల్లగొండ, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్లగొండ మండలం పెద్దసూరారం గ్రామపంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం సమీక్షించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రకటనలు చేశారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల

మిగతా 2లో

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పొన్నం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్
- సుప్రీంకోర్టు తీర్పుపై ధన్యవాదాలు తెలిపిన మంత్రి
- సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపు వస్తుందని వ్యాఖ్య
- ప్రభుత్వ న్యాయపోరాటం ఫలితమే తీర్పని అభిప్రాయం



**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున

మిగతా 2లో

## ఎల్లంపల్లిని సందర్శించిన మంత్రులు

- ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్ట సాగునీరే లక్ష్యమన్న ఉత్తమ్
- గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని వెల్లడి
- మూడు బ్యారేజీల్లో నీటి నిల్వలపై ఎన్‌డీఎస్‌ఏ సూచనలు ప్రస్తావన
- ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రుల బృందం



**పెద్దపల్లి, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్ట స్థాయిలో సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించేందుకు వివిధ ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మాణం ప్రారంభమై రైతులకు దశాబ్దాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అధిక భాగం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఆ బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిందని గుర్తు చేశారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు.

మిగతా 2లో

## మార్కెటింగ్ శాఖలో డిజిటలీకరణకు వేగం

- వ్యవసాయ మార్కెట్లను పూర్తిస్థాయిలో డిజిటలీకరించాలని మంత్రి తుమ్మల ఆదేశం
- 206 మార్కెట్ కమిటీల ఆటోమేషన్‌కు కార్యాచరణ సిద్ధం
- సౌర విద్యుత్ వ్యవస్థలు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశం
- కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ పనులు వేగవంతం చేయాలని సూచన

2లో



## ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం

- నవతెలంగాణ వార్షికోత్సవ సెమినార్‌లో కేటీఆర్ ప్రసంగం
- దేశంలో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తోందని వ్యాఖ్య
- సోషల్ మీడియాతో జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- ఫేక్ వార్తలపై వాస్తవ నిర్ధారణ అవసరమని సూచన

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

నవతెలంగాణ 11వ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన "రాజ్యాంగం - ప్రజాస్వామ్యం - పత్రికా స్వేచ్ఛ" అంశంపై సెమినార్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

మిగతా 2లో



## గ్రామాభివృద్ధిపై మంత్రి దృష్టి

- తిప్పర్తి మండలంలో అభివృద్ధి పనుల పరిశీలన
- గ్రామస్తులతో సమావేశమై సమస్యలపై ఆరా
- అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు
- నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

2లో





## వరద శాంతించాలని గోదావరికి మంత్రి పూజలు

- వరద పరిస్థితిని పరిశీలించిన మంత్రి సీతక్క
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

**ములుగు, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

గోదావరి వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం వాజేడు మండలం పుసూరు బిడ్జి వద్ద వరద పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. గోదావరి నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత

మిగతా 7లో



## ఉప్పల్ నల్లచెరువుకు జలకళ

- భారీ వర్షా లతో వరద నీటితో నిండిన చెరువు
- హైడ్రా పునరుద్ధరణతో పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం
- ఆక్రమణల తొలగింపుతో 70 ఎకరాలకు విస్తరణ
- ప్రజల కోసం ఆధునిక సౌకర్యాల ఏర్పాటు

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టిన ఉప్పల్ నల్లచెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన వరద నీరు చెరువులోకి చేరడంతో నీటి నిల్వ గణనీయంగా పెరిగింది. గతంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో మురికి కూపంగా మారిన ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తున్న హైడ్రా చర్యలు ఫలితాలిస్తున్నాయి. చెరువులోకి వరద నీరు సక్రమంగా చేరేలా, మురుగునీరు ప్రత్యేక కాలువల ద్వారా బయటకు వెళ్లేలా హైడ్రా ఇన్‌లెట్లు, కాలువలను అభివృద్ధి చేసింది. దీంతో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వలు తగ్గి, వరద నీరు నేరుగా నల్లచెరువులోకి చేరిందని అధికారులు తెలిపారు. ఉప్పల్ నల్లచెరువులో గతంలో జరిగిన ఆక్రమణలను తొలగించి 10 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 7లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పొన్నం

(మొదటి పేజీ తరువాయి)




సమర్థవంతంగా న్యాయపోరాటం నిర్వహించడంతో ఈ అనుకూల తీర్పు వచ్చిందని అన్నారు. న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సేవలు కూడా ఈ విజయంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.

గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టుల అమలుకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగవంతమై రాష్ట్ర అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు అనేక ప్రాంతాల తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు.

తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం సాగించిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. అభివృద్ధి ప్రాజెక్టుల అమలుపై ప్రభుత్వం అదే నిబద్ధతతో ముందుకు సాగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో ప్రాజెక్టుల పురోగతి, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. ప్రజలకు ఉపయోగపడే కీలక సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మార్కెటింగ్ శాఖలో డిజిటలీకరణకు వేగం

హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖను సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన మార్కెటింగ్ శాఖ సమీక్షా సమావేశంలో డిజిటలీకరణ, అభివృద్ధి పనులు, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, సౌర విద్యుత్ వ్యవస్థలు, ఇంజినీరింగ్ పనులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, వాహనాల ప్రవేశ-నిష్క్రమణ వ్యవస్థలను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేసి, అన్ని లావాదేవీలు డిజిటల్ రూపంలో నమోదు అయ్యేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని ఐటీ విభాగానికి సూచించారు. ఇకపై శాఖలో జరిగే కొనుగోళ్లన్నీ పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.

రానున్న పత్తి కొనుగోలు సీజన్‌కు ముందుగానే సమగ్ర సన్నద్ధత చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు తొలి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహించాలని సూచించారు. కనీస మద్దతు ధర ప్రయోజనం పూర్తిగా రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని, గతంలో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని హెచ్చరించారు. ప్రత్యేక తనిఖీ బృందాల నివేదికల ఆధారంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పనులు ఆలస్యం అయితే అవసరమైతే ఇతర శాఖలకు అప్పగించి వేగంగా పూర్తిచేయాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు అత్యంత ప్రాధాన్యంగా చేపట్టి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి నవంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన నమూనాలను వచ్చే వారంలోగా ఖరారు చేసి, ముఖ్యమంత్రి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మార్కెటింగ్ శాఖలో సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి అదనపు పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని, శాఖ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతు సంఘం నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పలు సమస్యలను వివరించారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడం, గెలల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం, బ్యాంకు రుణాలు, యంత్ర పరికరాలపై సబ్సిడీ, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అధికారులు, కంపెనీలు, రైతులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.



# పెద్దసూరారంలో అభివృద్ధికి ఊతం

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్ల వ్యయంతో రోడ్లు, భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు.

పెద్దసూరారం గ్రామానికి కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. సెప్టెంబర్ నెలలో శంకుస్థాపన చేసి మూడు నుంచి నాలుగు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి చెప్పారు. పెద్దసూరారం మహిళా సంఘాలకు ఆగస్టు 15న రూ.2.5 కోట్ల రుణాల చెక్కులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలు చిన్న పరిశ్రమలు, రైస్‌మిల్లులు వంటి ఉపాధి ఆధారిత సంస్థలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. చిన్నసూరారం-పెద్దసూరారం మధ్య రైస్‌మిల్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని, నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాల్లో కూడా రైస్‌మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని మంత్రి కోరారు. గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మందికి సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. ప్రతి వారం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానమ్మ, ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లిని సందర్శించిన మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జల పరిస్థితులను పరిశీలిస్తున్నామని చెప్పారు. మంచి వర్షాలతో ప్రాజెక్టులు నిండుతున్నాయని, రైతులకు ఎప్పటికప్పుడు పరిస్థితులు వివరించి అవసరమైతే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాణ్యత లోపాల కారణంగానే దెబ్బతిన్నాయని ఆరోపించారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు అందించే అవకాశాలు ఉన్నప్పటికీ భారీ ఎత్తిపోతల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో విద్యుత్ వ్యయం పెరిగిందని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల భారీగా ప్రజాధనం వృథా అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వలు, సాగునీటి పంపిణీపై అధికారులు మంత్రులకు వివరించారు.



# ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం

(మొదటి పేజీ తరువాయి)

నవతెలంగాణ 11 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో మీడియా స్వేచ్ఛ రోజురోజుకూ క్షీణిస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియా సంస్థలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అనేక సంస్థలు ఏదో ఒక వర్గానికి మద్దతుగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. వార్తను వార్తగానే రాసే పరిస్థితి లేకుండా పోయిందని, తప్పు జరిగినా నిర్భయంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.

స్వేచ్ఛాయుత మీడియా, నిర్భయమైన జర్నలిజం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛకు ఎలాంటి పరిమితులు ఉండకూడదని, నిజాలు చెప్పేవారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు విద్వేషపూరిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వల్ల ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరిగిందని కేటీఆర్ అన్నారు. యువత సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తూ మార్పును కోరుతోందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను తప్పనిసరిగా వాస్తవ నిర్ధారణ చేసి మాత్రమే ప్రచారం చేయాలని సూచించారు.

ప్రగతి భవన్, ప్రాజెక్టుల వ్యయం, ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాలపై గతంలో తప్పుడు ప్రచారం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. అలాగే లగచర్ల ఘటన, హెచ్‌సీయూ భూముల వ్యవహారం, కేంద్ర మంత్రికి సంబంధించిన ఆరోపణలు వంటి అంశాలకు తగిన స్థాయిలో ప్రచారం లభించలేదని విమర్శించారు. ఒక రీట్వీట్ చేసిన వ్యక్తిని జైలుకు పంపడం వంటి ఘటనలను కూడా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించడం అత్యంత కీలకమని కేటీఆర్ అన్నారు. మంచి విషయాలను మంచిగా, చెడు విషయాలను చెడుగా ప్రజల ముందుంచే బాధ్యత మీడియాపై ఉందని పేర్కొన్నారు. కొత్త తరం ప్రశ్నించే ధోరణిని ప్రోత్సహిస్తూ, బాధ్యతాయుతమైన మీడియా వ్యవస్థ దేశానికి అవసరమని అన్నారు.





# గ్రామాభివృద్ధిపై మంత్రి దృష్టి

నల్గొండ, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి మూలమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం తిప్పర్తి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, వివిధ గ్రామాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పజ్జూరు, సోమోరిగూడెం గ్రామాల్లో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎర్రగడ్డలగూడెం గ్రామంలోని రచ్చ బండ వద్ద గ్రామస్తులతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజలు వినిపించిన సమస్యలను ఓపికగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఇండ్లూరు గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామస్థాయిలో మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించి చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- ఆగస్టు 15 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు.. ఇంటర్ అర్హత కలిగిన స్థానిక మహిళలకు అవకాశం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ జిల్లాలోని పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 60 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి తెలిపారు.
గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 20, హుజూరాబాద్‌లో 16, కరీంనగర్ రూరల్‌లో 16, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 8 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.
ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కలిగిన మహిళలు మాత్రమే అర్హులని, అభ్యర్థి సంబంధిత అంగన్వాడీ కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీ లేదా పట్టణ వార్డు/డివిజన్‌కు స్థానికురాలై ఉండాలని స్పష్టం చేశారు.
2026 జూలై 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఖాళీల వివరాలు, రిజర్వేషన్, ఎంపిక విధానం తదితర పూర్తి సమాచారం కోసం https://wdcw.tg.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి, అదే పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాలని సూచించారు.




# దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల్లో మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

**వేలేరు, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గమ్మ ఆలయం, పోచమ్మ ఆలయ ఆవరణల్లో నూతన మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులకు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ నిధులతో ఈ మినీ వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో పోచమ్మ ఆలయం వరకు నూతన సీసీ రోడ్డు నిర్మించామని, గ్రామపంచాయతీ నిధులతో లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం ఆవరణలో సీసీ రోడ్డు కూడా మంజూరైందని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి వేలేరు గ్రామాన్ని జిల్లా స్థాయిలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీకర్, ఏఎంసీ డైరెక్టర్ సంపత్, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, సురేష్, సునీల్, సంధ్య, చైతన్యతో పాటు కాలనీ పెద్దలు సంపత్ రెడ్డి, రాజు, సురేష్, తిరుపతి, సదానందం, రాజశేఖర్, నరసయ్య, రంగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






# వెలుగుమట్ల ఇల్లు కూల్చివేత రాజ్యాంగ విరుద్ధం..

- *సంపూర్ణ న్యాయం చేయకపోతే రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తాం*...
- డా., భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్

**ఖమ్మం బ్యూరో, ఆగష్టు 1(తెలంగాణ ముచ్చట్లు )**

కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన వెలుగుమట్ల మిగిలిన భూదాన బాధితులందరికీ వెలుగుమట్లలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వేలాది మందితో జేఏసీ జండాలతో నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగినది . అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన అంబేద్కర్ మనవడు డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా బుధాన భూమిలో నివాసముంటున్న ప్రజల ఇల్లు కూల్చడం అత్యంత అమానుషం ఇది రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు . కూల్చినవాడి కులం కూల్చి వేయబడ్డవాడి కులం వేరు కనుకనే ఈ దుర్మార్గం జరిగింది . స్థానిక ఎమ్మెల్యే దీనికి బాధ్యత వహించి రాజీనామా చేయాలి . ప్రభుత్వం తక్షణమే మేల్కొని మిగతా బాధితులందరికీ కూడా వెలుగుమట్లలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలి . లేనియెడల రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని పేర్కొన్నారు . మా ఎంపీలతో పార్లమెంట్లో వెలుగుమట్ల అంశాన్ని లేవనెత్తి ఖమ్మం ఎంపీ రెడ్డి ని నిలదీస్తాము అన్నారు . రాష్ట్రపతిని స్వయంగా కలిసి ఏలాంటి పర్మిషన్ లేకుండా ఇల్లు కూల్చిన అధికారులను , ప్రజా ప్రతినిధులను తక్షణమే సస్పెండ్ చేసి కూల్చిన వారి ఇల్లు ఖరీదులను వీరి వద్దనే రికవరీ చేసేదాకా వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటానని అన్నారు . మరో గౌరవ అతిథి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేసి మేము పరిశీలించగా ఇది కొందరు భూ బకాసురులు స్వాధీనం చేసుకునేందుకే అధికారులను బ్లాక్ మెయిల్ చేసి ఈ కుట్రకు పూనుకున్నారు . ఇప్పటికే బాధితులకు మద్దతుగా లీగల్ గా నేను మద్దతు ఇస్తూ వస్తున్నాను కానీ మిగతా బాధితులకు ఆ వెలుగుమట్లలోనే ఇల్లు నుంచి ఇవ్వకపోతే అందరిపై హైకోర్టులో కేసులు వేస్తాము అని అన్నారు . సుప్రీంకోర్టు దాకా ఈ విషయాన్ని తీసుకువెళతాము ప్రత్యక్షంగా నేనే అమర నిరాహార దీక్షకు పూనుకుంటాను అని తెలిపారు . పేద ప్రజల ఇల్లు కూల్చివేతకు ఆవేదన చెంది భారీ మహాధర్నాను కొనసాగించి వెలుగుమట్లలోనే వారికి ఇల్లు వచ్చేదాకా అమర నిరాహార దీక్ష చేసిన డా, విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ బాధితులు జేఏసీ ఆధ్వర్యంలో చేసిన మహాధర్నా ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి 311 ఇల్లు ఇచ్చిందని మిగిలిన వారికి తక్షణమే అదే వెలుగుమట్లలో నిర్మించి ఇవ్వాలని లేనియెడల బాధితులతో రేవంత్ రెడ్డి ఇంటిదాకా పాదయాత్ర కొనసాగిస్తామని అన్నారు . ఖమ్మంలో కొనసాగుతుంది కమ్మ కుల రాజకీయ ఆధిపత్యం అని దానికి ఆజ్య పోస్తుంది తుమ్మల నాగేశ్వరావు అని తన కులాన్ని ప్రేమగా చూడటం వారికి సౌకర్యాలు కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధమన్నారు . ఈ వెలుగుమట్ల ఘటన వారి కురత్వాన్ని వెలుగు చాటింది . ఇక వారి రాజకీయ సమాధికి పునాదులు పడ్డాయని అన్నారు . బీసీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలో నాయకత్వం వహిస్తున్న వారి సామాజిక వర్గాన్ని కలుపుకొని తుమ్మల నాగేశ్వరరావు ఈ పేద ప్రజల ఇల్లు కూల్చివేతకు సిద్ధపడ్డాడు . ఇది జిల్లా కాదు అని ఇది ఒక కమ్మ దేశమని . ఇక్కడ 90% గా ఉన్న దళిత బహుజనులు ఆత్మగౌరవం లేకుండా బ్రతుకుతున్నారని వెలుగుమట్ల ఘటన చెప్పకనే చెబుతుందని అన్నారు . 729 ఇల్లు కూర్చమని ప్రభుత్వమే స్వయంగా ఒప్పుకొని 311మందికి వెలుగుమట్లలో మిగతా వారిని పక్కకు పెట్టగా ఆరు నెలల సుదీర్ఘ మా జేసి పోరాటం ద్వారా మిగతా వారి గోడ ఇల్లు ఇస్తామని కానీ వేరే ప్రాంతంలో ఇస్తామని చెప్పటం మరో కుట్రకు పూనుకున్నారని అర్థమవుతుంది కనుక తక్షణమే వెలుగుమట్లలోనే మిగతా వారికి ఇల్లు ఇవ్వని ఎడల ఖమ్మంలో మరో భూకంపాన్ని చూస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆర్పిఐ పార్టీ తెలంగాణ ఇన్చార్జ్ మేజర్ చంద్రకాంత్ , జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల ముదిరాజ్ రాఘవేంద్ర , తెలంగాణ విఠల్ , ప్రముఖ న్యాయవాది పంజాకుల లక్ష్మీనారాయణ , జేఏసీ ఖమ్మం జిల్లా నాయకత్వం , భూదాన బాధితులు , ఆయా ప్రజా సంఘాల నాయకత్వం హాజరైంది .



# అర్హులైన ప్రతి ఓటరే లక్ష్యం.. క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు జమ్మికుంట పట్టణంలోని 204, 205 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక ధృవీకరణ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తున్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ఉండేలా బూత్ అధ్యక్షులు, బీఎల్‌వోలు సమన్వయంతో విస్తృతంగా కృషి చేస్తున్నారు.
పట్టణానికి వెలుపల నివసిస్తున్న ఓటర్లను సైతం ఫోన్ ద్వారా సంప్రదించి వారి వివరాలను నిర్ధారిస్తూ, అవసరమైన సమాచారాన్ని బీఎల్‌వోలకు అందజేస్తున్నారు. దీంతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా పూర్తయ్యే దశకు చేరుకుంది.
ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని కోటి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేస్తున్న బూత్ అధ్యక్షులు, బీఎల్‌వో అధికారుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ సహకరించి తమ వివరాలను సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వీణవంకలో 'సర్' ఫారాల డిజిటలైజేషన్ 99 శాతం పూర్తి

- 55 పోలింగ్ కేంద్రాల్లో వేగంగా ప్రక్రియ.
- కేవలం 767 ఫారాలు మాత్రమే పెండింగ్.

**వీణవంక, ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ జిల్లా వీణవంక మండల వ్యాప్తంగా 'సర్' ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 99 శాతం పూర్తయినట్లు తహశీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు. మండలంలోని మొత్తం 55 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న 43,260 మంది ఓటర్లలో ఇప్పటికే 38,565 మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు.
మండలంలోని 18 పోలింగ్ కేంద్రాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం కేవలం 767 ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
అలాగే 3,928 మంది ఓటర్లు వలస వెళ్లడం లేదా మరణించడం వంటి కారణాలతో వారి వివరాలను గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేసి, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ వివరించారు.



# ఫీల్డ్ అసిస్టెంట్లకు నిరసన కార్యక్రమాలతో సంబంధం లేదు

- వనపర్తి డీఆర్‌డీఓకు వినతి

**వనపర్తి,ఆగస్టు01(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లాలో వి.బి.జి. ర్యామ్.జి.లో ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు స్పష్టం చేశారు.ఈ మేరకు జిల్లా డీఆర్‌డీఓకు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లందరూ తమ విధుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొనడం లేదని, ఆయా కార్యక్రమాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.మండల లాగిన్‌ల విషయంలో సీఓలు పాస్‌వర్డ్‌లను మార్చడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పనులకు సంబంధించిన విధులను నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా ఫిట్టింగ్, ప్లాంటింగ్, ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఫార్మ్ పాండ్స్‌కు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉందన్నారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లోని కూలీలు ఉపాధి పనులకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లకు తిరిగి మండల లాగిన్ సౌకర్యం కల్పించాలని డీఆర్‌డీఓను కోరారు. లాగిన్ సదుపాయాన్ని పునరుద్ధరించి, కూలీలకు పనులు కల్పించేందుకు అవకాశం ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమం వనపర్తి జిల్లా కమిటీ అధ్యక్షుడు పానుగంటి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, జనరల్ సెక్రటరీ అశోక్ గౌడ్, ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యుడు మోచర్ల నరసింహతోపాటు ఇతర కమిటీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

పని నిమిత్తం వెళ్లిన వ్యక్తి అదృశ్యం..

# మిస్సింగ్ కేసు నమోదు

- **జమ్మికుంట టౌన్ ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):**




మడిపల్లి గ్రామానికి చెందిన పల్లకొండ సదయ్య (39) అదృశ్యమైన ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం, సదయ్య జులై 30వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో ఆయన భార్య పల్లకొండ మౌనిక కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పల్లకొండ మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి సదయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# వెల్టూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్, వార్డు సభ్యుల క్షేత్రస్థాయి పర్యటన

- **పెద్దమందడి,ఆగస్టు01(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ అశోక్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ కాలనీ, ఓల్డ్ ఎస్సీ కాలనీ, కుమ్మరి గేరి ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు.పర్యటనలో భాగంగా ఆయా కాలనీల్లో శిథిలావస్థకు చేరిన పాడుబడిన ఇళ్లను గుర్తించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను మూడు రోజులలోగా తొలగించాలని సంబంధిత యజమానులకు సూచించారు.ఓల్డ్ ఎస్సీ కాలనీలో సర్కార్ తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు అధికంగా పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని స్థానికులు సర్పంచ్, వార్డు సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వారు వీలైనంత త్వరగా జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలు, సర్కార్ తుమ్మ చెట్లను తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యాలను, మౌలిక వసతులను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, వార్డు సభ్యులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి కూడా పాల్గొన్నారు.

# సత్తుపల్లిలోనే వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

- **-విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్.**
- **-హెల్త్ కార్డులు, డీఏలు, పీఆర్సీ అమలుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి.**

**సత్తుపల్లి, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉద్యోగులు, పెన్షనర్లకు అందుబాటులో వైద్య సేవలు అందేలా సత్తుపల్లిలో వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సత్తుపల్లిలోని సంఘ భవనంలో అధ్యక్షుడు కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సమావేశంలో కార్యదర్శి నివేదికను ప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శి నివేదికను జి. కృష్ణయ్య ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ, సత్తుపల్లి ప్రాంత ప్రజల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రం ఖమ్మం సత్తుపల్లికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉందని, సత్తుపల్లి సబ్ ట్రెజరీ పరిధిలో వేలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ఖమ్మం వెళ్లడం ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో సత్తుపల్లిలోనే వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

**హెల్త్ కార్డులపై అయోమయం**

ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకం అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. విధివిధానాలు పూర్తిగా ఖరారు కాకముందే జూన్ నెల నుంచి ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లలో 1.5 శాతం కోత విధిస్తున్నప్పటికీ, వైద్య సేవలు అందించే ఆసుపత్రుల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆసుపత్రుల్లో చాలావరకు హెల్త్ కార్డులను అంగీకరించడం లేదని, ఇప్పటి వరకు ఉద్యోగులు, పెన్షనర్లకు హెల్త్ కార్డులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న చర్చలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యామిలీ పెన్షనర్లు మాట్లాడుతూ తమకు వచ్చే పెన్షన్ స్వల్పంగా ఉండగా, అందులోనూ 1.5 శాతం కోత విధించడం ఆర్థిక భారంగా మారిందని తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్లకు ఉచిత వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**డీఏలు, పీఆర్సీ అమలు చేయాలి**

ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదికను వెంటనే స్వీకరించి అమలు ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమ కార్యాచరణకు దిగాల్సి వస్తుందని సమావేశంలో హెచ్చరించారు. సమావేశంలో అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి ప్రకాశరావుతో పాటు రామిశెట్టి సుబ్బారావు, అద్దంకి వెంకటరత్నం, ఎన్. నర్సయ్య, జి. కృష్ణయ్య, యోగానంద్, మహమూద్, కమలకుమారి, వాణి, సాంబశివరెడ్డి, బూరుగు దాసు, సుందరరావు, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.






# నిరుపేదల గుండెల్లో నిలిచిన నాయకుడు స్వామిగౌడ్

- **సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ఖమ్మం బ్యూరో, ఆగష్టు 1(తెలంగాణ ముచ్చట్లు )**

నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దూసరి స్వామిగౌడ్ అని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు శుక్రవారం రాత్రి నేరడ గ్రామంలో జరిగిన స్వామిగౌడ్ 24వ వర్ధంతి సభలో సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుండి చింతకాని మండలం నేరడ గ్రామంలో స్వామిగౌడ్ అడుగు పెట్టిన రోజుల్లో అగ్రవర్ణాల చేతుల్లో నలిగిపోతున్న నిరుపేదలను చూసి చలించిపోయారన్నారు కమ్యునిస్టు సిద్ధాంతాలను ఆచరిస్తూ పెత్తందారులను ఎదిరించి వందల ఎకరాల బంజర భూములను పేదలకు పంచి పెట్టిన ఘనత స్వామిగౌడ్ నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు గ్రామంలో పాఠశాల నిర్మించి విద్యావకాశాలు కల్పించిన మహానుభావుడు స్వామి గౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్ గా ప్రజలకు ఎనలేని సేవలు అందిచారన్నారు. స్వామి గౌడ్ స్ఫూర్తితో నిరుపేదలకు అండగా వారి సమస్యల పరిష్కారం కోసం నేటికి వారి కుటుంబ సభ్యులు శ్రీరాములు, నేతాజీ, గోపాలరావు కళ్యాణ్ లు పనిచేస్తున్నారన్నారు. నేడు సర్పంచ్ గా నేతాజీ గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు అనంతరం స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు సిపిఐ జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామసర్పంచ్ దూసరి నేతాజీ గ్రామ ఉపసర్పంచ్ కోట బాలేష్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోగుల ఆది గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు సిపిఐశాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి,మట్టా రవి కాటిరాల మహేష్ గూనుగుంట్ల వెంకన్న అమడాల వెంకటేష్ దోని వెంకన్న రాగం లింగరాజు కొల్లి సతీష్ సైదా గోగుల వెంకట్రావు ప్రవీణ్ కోట వీరయ్య అంతోని జి నవీన్ బత్తుల కృష్ణ పులిపాటి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు






# ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

- **తహసీల్దార్‌కు బీసీ జేఏసీ వినతి**

**హుజూరాబాద్, ఆగస్టు 1(తెలంగాణ ముచ్చట్లు ):**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చిన నేపథ్యంలో హుజూరాబాద్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. హుజూరాబాద్ నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని నేతృత్వంలో హుజూరాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా, జమ్మికుంట, ఇల్లంతకుంట మండల తహసీల్దార్లకు కూడా ఇదే డిమాండ్‌తో వినతి పత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ హుజూరాబాద్ అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి భర్తీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2తో పాటు వివిధ శాఖల్లో ఏర్పడిన ఖాళీలు సంవత్సరాలుగా పెరుగుతున్నా నియామక ప్రక్రియ ముందుకు సాగకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోందని అన్నారు.

కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసిన తరువాత కూడా అవసరమైన ఉద్యోగులను నియమించకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిభారం పెరిగిందని, ప్రజలకు సేవలు ఆలస్యంగా అందుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, వైద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల విద్యాభ్యాసం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్య అందాల్సిన సమయంలో ఉపాధ్యాయుల కొరతతో తరగతులు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి నెలకొనడం విచారకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు.

పోలీసు శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల శాంతిభద్రతల పరిరక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఒకవైపు నేరాల నియంత్రణ, మరోవైపు ప్రజలకు భద్రత కల్పించడంలో సిబ్బంది కొరత ప్రభావం చూపుతోందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి శాఖలో అవసరమైన మేరకు సిబ్బందిని నియమించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలను మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్, కోశాధికారి ఇప్పకాయల సాగర్, కొలిపాక క్రాంతి, మామునూరి ప్రవీణ్, గడ్డం రఘు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.



# బాల కార్మిక నిర్మూలనకు కఠిన చర్యలు

- **ఆపరేషన్ ముస్కాన్–12లో 82 మంది బాల కార్మికులకు విముక్తి**
- **వనపర్తి,ఆగస్టు01(తెలంగాణ ముచ్చట్లు):**




బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. 12వ విడత ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 82 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించినట్లు వెల్లడించారు. వీరిలో 78 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 26 మంది యజమానులపై కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. రక్షించిన బాలలకు సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించడంతో పాటు, వారి విద్యాభ్యాసానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాలలకు, వారి తల్లిదండ్రులకు బాలల హక్కులు, నిర్బంధ విద్య, బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వివరించారు.బాలల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతానికి పోలీసుశాఖ, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, వైద్యశాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని అభినందించారు.18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతంగా భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని ఎస్పీ హెచ్చరించారు. పశువుల కాపరులుగా, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో బాలలను పనిలో పెట్టుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్-1098 లేదా డయల్-100కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# చీకటికి చెక్.. వాకర్ల కోసం కొత్త లైట్లు ఏర్పాటు

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే ప్రజలకు చీకటి కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మైదానం చుట్టూ తగినంత వెలుతురు లేక మహిళలు సహా వాకర్లు భయాందోళనలకు గురవుతూ, పలుమార్లు అధికారులకు వినతులు చేసినా స్పందన రాలేదని వాకర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 26వ వార్డు కౌన్సిలర్ దిడ్డి కోమల తనయుడు రాము చొరవ తీసుకుని మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసి, మైదానం చుట్టూ ఉన్న విద్యుత్ స్తంభాలపై పనిచేయని బల్బులను తొలగించి కొత్త బల్బులను ఏర్పాటు చేయించారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, యువత ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా వ్యాయామం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.
చాలా కాలంగా ఉన్న సమస్య పరిష్కారమవడంతో వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొన్నం శ్రీను, భీష్మచారి, శ్రీను, శ్రీకాంత్, అశోక్, సంపత్, రాజబాబు, సత్యం, తిరుపతి, మహేందర్ తదితర వాకర్లు కౌన్సిలర్ చొరవను అభినందించారు.

# నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మల్లారెడ్డిపల్లి యువకుడు

- **వీణవంక, ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల సమ్మన్న ముదిరాజ్ తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను యజమానికి సురక్షితంగా అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. జూలై 31న పెద్దపల్లి జిల్లా గురాంపల్లిలో జరిగిన అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా, కాల్వ శ్రీరాంపూర్ మండలం గూడెం బస్టాండ్ సమీపంలో ఒక సెల్‌ఫోన్ ఆయనకు దొరికింది. అనంతరం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయడంతో, హుజూరాబాద్‌కు చెందిన విల్సన్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్ మార్గమధ్యలో పోయిందని గుర్తించి సమ్మన్నను సంప్రదించాడు.
శుక్రవారం మల్లారెడ్డిపల్లి గ్రామానికి వచ్చిన విల్సన్ తన వివరాలను నిర్ధారించగా, గ్రామస్తుల సమక్షంలో గోనెల సమ్మన్న ముదిరాజ్ సెల్‌ఫోన్‌ను ఆయనకు అప్పగించారు. తన ఫోన్‌ను సురక్షితంగా తిరిగి అందించిన సమ్మన్నకు విల్సన్ కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా గ్రామస్తులు సమ్మన్న ముదిరాజ్ నిజాయితీ, మానవత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో గుమ్మడి సంపత్, రాయణవేణి చంద్రయ్య, ముద్దసాని శంకరయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# భద్రాచలం వద్ద ఉధృతమైన గోదావరి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 1(తెలంగాణ ముచ్చట్లు )**

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నది మరింత ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట సమయం దాకా గోదావరి వరద ఉధృతి 56.10 అడుగులుగా, 15,96,899 క్యూసెక్కులుగా, మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న విషయం తెలుసుకుని.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కోరారు.


**జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా అత్యవసర సమీక్ష**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ లతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి తాజా పరిస్థితులపై ఎంపీ రఘురాం రెడ్డి ఆరా తీశారు. గోదావరి వరద ఉధృతి, సహాయక చర్యల తీరుపై చర్చించి సూచనలు చేశారు.
నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున కరకట్టల వెంబడి, లీకేజీలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో సంబంధిత సిబ్బంది ద్వారా నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.
ఏజెన్సీలో రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా మరియు అత్యవసర సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. నిర్వాసితులకు తాగునీరు, వైద్యం, భోజన వసతి సక్రమంగా అందేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.



# హైదరాబాద్‌లో ఎగుమతులపై రెండ్రోజుల శిక్షణా కార్యక్రమం

**హైదరాబాద్, ఆగస్టు 1 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఎగుమతి రంగంపై ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, వ్యాపారవేత్తల కోసం హైదరాబాద్‌లో రెండు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) ఆధ్వర్యంలో "ఎగుమతి అవకాశాలు - ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి" అనే అంశంపై ఆగస్టు 6, 7 తేదీల్లో ఈ సర్టిఫికెట్ కార్యక్రమం జరగనుంది.
అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపారాన్ని విస్తరించాలనుకునే వారికి అవసరమైన నైపుణ్యాలు, అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. కొత్తగా ఎగుమతి వ్యాపారం ప్రారంభించాలనుకునే వారితో పాటు ఇప్పటికే ఈ రంగంలో ఉన్న వారికి కూడా ఉపయోగపడేలా శిక్షణను రూపొందించారు.
ఈ కార్యక్రమంలో ఎగుమతి విధానాలు, డాక్యుమెంటేషన్, నియంత్రణ నిబంధనలు, ట్రేడ్ ఫైనాన్స్, జీఎస్టీ, ఎగుమతి ప్రోత్సాహకాలు, సరైన విదేశీ మార్కెట్ ఎంపిక, కొనుగోలుదారుల గుర్తింపు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నారు.
అంతర్జాతీయంగా వ్యాపారాన్ని విస్తరించాలనుకునే సంస్థలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఫియో జాయింట్ డైరెక్టర్ జనరల్ ఉన్నికృష్ణన్ కె. తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం, ఎగుమతి నిబంధనలు, మార్కెట్ వ్యూహాలపై స్పష్టమైన అవగాహన పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. శిక్షణలో పాల్గొనేవారు బ్యాంకులు, ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) అధికారులతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఫియో సర్టిఫికెట్ అందజేయనుంది. ఆసక్తి గల వారు తెలంగాణ చాప్టర్ హెడ్ ఆర్. కులకర్ణిని 9848286640 నంబర్‌లో నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.
1965లో భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఫియో, దేశంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిళ్లు, కమోడిటీ బోర్డులు, అభివృద్ధి సంస్థలకు అత్యున్నత ప్రతినిధి సంస్థగా కొనసాగుతోంది.



# ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంపు..

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గడువు ముగియడంతో దేశంలో ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థలు తమ వాహనాల ధరలను పెంచాయి. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలతో ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలుదారులపై అదనపు భారం పడింది. సవరించిన ధరలు ఇప్పటికే ఆయా కంపెనీల అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి వచ్చాయి.
మోడల్‌ను బట్టి ఎక్స్‌షోరూమ్ ధరలు రూ.5,000 నుంచి రూ.12,000 వరకు పెరిగాయి. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆన్‌రోడ్ ధరలపైనా నేరుగా ప్రభావం పడనుంది. ఇప్పటికే వాహనాలను బుక్ చేసుకున్న వినియోగదారులకు డీలర్లు కొత్త ధరలకు అనుగుణంగా ఇన్‌వాయిస్‌లు సిద్ధం చేస్తున్నారు. అయితే జూలై నెలలోనే బుకింగ్ పూర్తి చేసిన కొందరికి పాత ధరల ప్రయోజనం లభించే అవకాశం ఉందని డీలర్లు చెబుతున్నారు.
ఓలా ఎలక్ట్రిక్ తమ ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్ మోడళ్ల ధరలను పెంచగా, ఎస్1 ప్రో కొత్త ధర రూ.1,39,999కు చేరింది. ఏథర్ ఎనర్జీ 450ఎక్స్, 450 అపెక్స్ మోడళ్ల ధరలను సవరించగా, ఏథర్ 450ఎక్స్ ధర రూ.1,51,000గా మారింది. టీవీఎస్ ఐక్యూబ్ ఎస్‌టీ ధర రూ.12,000 పెరిగి రూ.1,67,000కు చేరుకోగా, బజాజ్ చేతక్ ధర రూ.8,000 పెరిగి రూ.1,31,000గా నమోదైంది.
ధరల పెరుగుదలతో నెలవారీ ఈఎంఐలపైనా ప్రభావం పడనుంది. మూడేళ్ల రుణ కాలపరిమితితో వాహనం కొనుగోలు చేసే వినియోగదారులు ప్రతి నెలా సుమారు రూ.400 వరకు అదనంగా చెల్లించాల్సి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సవరించిన ధరలకు అనుగుణంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు కొత్త ఈఎంఐ వివరాలను సిద్ధం చేస్తున్నాయి.
కొత్తగా ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేయాలనుకునేవారు సమీపంలోని షోరూమ్‌లలో అందుబాటులో ఉన్న పాత స్టాక్‌పై వివరాలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని చోట్ల పాత ధరలకే వాహనాలు లభించే అవకాశం ఉండటంతో పాటు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, లాయల్టీ బోనస్‌లు, స్పాట్ డెలివరీ వంటి ప్రత్యేక ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు తాజా ధరలు, రుణ నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆఫర్లను పరిశీలించాలని సూచిస్తున్నారు.



# బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేసిన రావుల చంద్రశేఖర్ రెడ్డి



**కొత్తకోట,ఆగస్టు01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన కొత్త చిన్న సవరయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని పంపించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యుడు కొత్త నరసింహకు ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు

- **పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం కాపాడాలి**



**హుజురాబాద్, ఆగస్టు 1(తెలంగాణ ముచ్చట్లు ):** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీ ఏ ఎస్ ) పథకం కింద చదువుతున్న పేద విద్యార్థుల పెండింగ్ ఫీజులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ జీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నాయని, తోటి విద్యార్థుల ఎదుట అవమానపరిచే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజుల కోసం పేద పిల్లలు అవమానాలు భరించాల్సి రావడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన బీఏఎస్ పథకం అమలులో జాప్యం కారణంగా పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి బుక్స్, యూనిఫాంలు, ట్యూషన్ ఫీజుల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ భారమంతా పేద కుటుంబాలపై పడుతోందని, దీంతో విద్యార్థుల చదువుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు.
ఇది కేవలం ఫీజుల బకాయిల అంశం కాదని, పేద విద్యార్థుల చదువు, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని మహేందర్ జీ పేర్కొన్నారు. పేద పిల్లలకు విద్య అందించడమే కాకుండా వారి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా బీఎస్పీ తరఫున మూడు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. బీఏఎస్.విద్యార్థుల పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి, అవమానాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, పేద పిల్లల హక్కులను పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి సమస్యను ప్రజల ముందుకు తీసుకెళ్తామని, పేద విద్యార్థుల హక్కుల కోసం రాజీపడేది లేదని మహేందర్ జీ హెచ్చరించారు.

# వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలి మృతి

- **మల్లారెడ్డిపల్లిలో విషాదం**

**వీణవంక, ఆగస్టు 01 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల లచ్చవ్వ (80) ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందారు.
గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, లచ్చవ్వ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. అనారోగ్యం కారణంగా తరచూ మానసిక ఆందోళనకు గురయ్యేవారని కుటుంబ సభ్యులు తెలిపారు.
శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన లచ్చవ్వ శనివారం ఉదయం ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో పరిశీలించగా ఆమె మృతదేహం కనిపించింది.
సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.
మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉంటూ సౌమ్య స్వభావంతో మంచి పేరు సంపాదించుకున్న లచ్చవ్వ మృతి గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మృణాల్ ఠాకూర్ జీవితాన్ని మార్చిన అక్షయ్ కుమార్ సలహా

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ నేడు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా అభిమానులు సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు. ఇదే సమయంలో ఆమె గతంలో చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు మరోసారి వైరల్ అవుతున్నాయి.

బాలీవుడ్ నుంచి
వచ్చిన మృణాల్ ఠాకూర్, 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై తొలి చిత్రంతోనే ఘన విజయం అందుకున్నారు. తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ఆమె, అనంతరం 'హాయ్ నాన్న' చిత్రంతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ఆ తర్వాత విజయ్ దేవరకొండతో చేసిన 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా, 'కల్కి'లో అతిథి పాత్రతో పాటు 'డెకాయిట్' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు.

గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ తన వ్యక్తిగత జీవితంలోని ఓ కీలక విషయాన్ని పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో తన శరీరాకృతిపై వచ్చిన విమర్శలు తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యల కారణంగా ఎన్నో రాత్రులు నిద్రపట్టకుండా ఏడ్చానని తెలిపారు.

అలాంటి సమయంలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఇచ్చిన సలహా తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని మృణాల్ చెప్పారు. "నిన్ను నువ్వుగా అంగీకరించు. ఇతరుల కోసం మారాల్సిన అవసరం లేదు. పాత్ర కోసం అవసరమైతే మాత్రమే మారాలి" అని అక్షయ్ చెప్పిన మాటలు తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని వెల్లడించారు.

ఆ సలహా తర్వాత ఇతరుల విమర్శలను పట్టించుకోవడం మానేసి, తనకు నచ్చిన విధంగా సంతోషంగా జీవించడం ప్రారంభించానని మృణాల్ తెలిపారు. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె త్వరలో తమిళ సినీ పరిశ్రమలో కూడా అడుగుపెట్టనున్నట్లు సమాచారం.




# భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

- మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ గేట్వే
- బొబ్బిలి వీణతో ప్రధానికి సత్కారం
- థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణ

**భోగాపురం, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలిచే భోగాపురం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. విమానాశ్రయం నిర్మాణ విశేషాలు, ప్రయాణికులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికల గురించి జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లిఖార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహూకరించి ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర కళా సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ కానుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు సభా ప్రాంగణానికి ఓపెన్ టాప్ జీపులో చేరుకున్న ప్రధాని మోదీ మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. గిరిజన సంప్రదాయ కళారూపాలతో కళాకారులు, విద్యార్థులు ఆకట్టుకోగా, ప్రధాని వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన థింసా నృత్య ప్రదర్శన ఈ కార్యక్రమంలో వప్రధాన ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది గిరిజన యువతులు ఏకకాలంలో ప్రదర్శించిన థింసా నృత్యాన్ని ప్రధాని ఆసక్తిగా వీక్షించి అభినందించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలు చప్పట్లతో కళాకారులను ప్రోత్సహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య రంగాలకు కొత్త ఊపు లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో నిర్మించిన ఈ విమానాశ్రయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక కేంద్రంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు.





# విద్వేష ప్రసంగాలపై ఉక్కుపాదం

- అసెంబ్లీలో హేట్ స్పీచ్‌కు అడ్డుకట్ట
- సభా మర్యాదల పరిరక్షణకు కొత్త బిల్లు
- సెలెక్ట్ కమిటీ కీలక సమావేశం నిర్వహణ
- వర్షా కాల సమావేశాల్లోనే నివేదిక సమర్పించనున్న కమిటీ
- నిపుణులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలతో తుది నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నియంత్రించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న హేట్ స్పీచ్ బిల్లుపై కసరత్తు వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో శనివారం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ ఛైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్‌రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాల నియంత్రణ, క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుకు సంబంధించిన ప్రతిపాదనలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. సభలో భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా, అదే సమయంలో వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలను అరికట్టేలా చట్టపరమైన నిబంధనలను రూపొందించే అంశాలపై సమీక్ష నిర్వహించారు.

సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అసెంబ్లీ సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకునే హక్కు కొనసాగుతుందని, అయితే వ్యక్తిగత దూషణలు, విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలకు తావు లేకుండా బలమైన చట్టాన్ని తీసుకురావడమే కమిటీ లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షాకాల శాసనసభ సమావేశాలు ముగిసేలోపు క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుకు సంబంధించిన పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ నివేదికను సమగ్రంగా సిద్ధం చేసేందుకు కమిటీ త్వరలో మరోసారి సమావేశం కానుందని తెలిపారు.

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, న్యాయ నిపుణులు, మేధావులు, సమాజంలోని వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరించి వాటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నివేదికకు రూపకల్పన చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రతిపాదిత చట్టం ఎవరి హక్కులను హరించే ఉద్దేశంతో కాదని, శాసనసభ గౌరవాన్ని, ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సభా చర్చలు మరింత బాధ్యతాయుతంగా సాగేందుకు మాత్రమే ఈ బిల్లును తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.







# ఉప్పల్ నల్లచెరువుకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో చెరువు విస్తీర్ణం సుమారు 70 ఎకరాలకు పెరిగిందని అధికారులు వెల్లడించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరేలా రెండు ఇన్‌లెట్లను అభివృద్ధి చేయడంతో పాటు చెరువు నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఔట్‌లెట్‌ను కూడా ఆధునికీకరించారు. దీని వల్ల వరద ముప్పు తగ్గడంతో పాటు చెరువు నీటి నిర్వహణ మరింత మెరుగుపడిందని అధికారులు పేర్కొన్నారు.

చెరువును కేవలం నీటి నిల్వ కేంద్రంగా కాకుండా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదాన్ని అందించే ప్రదేశంగా తీర్చిదిద్దుతున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన కరకట్ట, పిల్లల ఆట స్థలం, బహిరంగ వ్యాయామ కేంద్రం వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ఆహ్లాదంగా గడిపే ప్రదేశంగా అభివృద్ధి చేస్తున్నట్లు హైడ్రా తెలిపింది. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన హైడ్రా, త్వరలో ఉప్పల్ నల్లచెరువును కూడా నగరానికి మరో అందమైన జలవనరుగా, వినోద కేంద్రంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది.

# వరద శాంతించాలని గోదావరికి మంత్రి పూజలు

(మొదటి పేజీ తరువాయి)



అధికారులను ఆదేశించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా గోదావరి వరద శాంతించాలని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు క్షేమంగా ఉండాలని, వరద ఉద్ధృతి తగ్గాలని ప్రార్థనలు చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పునరావాస ఏర్పాట్లపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని, అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, యంత్రాంగం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# భద్రాచలంలో మూడో ప్రమాద హెచ్చరిక

- **56 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం**
- **క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ అంకిత్**
- **లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే తరలించాలని ఆదేశం**
- **పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచన**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**





భద్రాచలం వద్ద గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి స్నాన ఘాట్లు, కరకట్టను సందర్శించి వరద పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం, ప్రభావిత గ్రామాల పరిస్థితి, సహాయక చర్యల పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 56 అడుగులకు చేరగా, సుమారు 15,90,778 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను టామ్‌టామ్, మైకింగ్ ద్వారా నిరంతరం అప్రమత్తం చేస్తూ ఆలస్యం చేయకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. వరద ముప్పు ఉన్న గ్రామాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి తాగునీరు, నాణ్యమైన ఆహారం, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వరద పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.





# వరద బాధితులకు మంత్రి భరోసా

- **మంగపేట పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మంత్రి సీతక్క**
- **28 కుటుంబాల 112 మందికి కల్పించిన సౌకర్యాలపై ఆరా**
- **ఆహారం, వైద్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక ఆదేశాలు**
- **ముంపు బాధితులకు శాశ్వత ఇళ్ల నిర్మాణానికి హామీ**

**ములుగు, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

గోదావరి వరదల నేపథ్యంలో మంగపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. వారికి కల్పిస్తున్న తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగపేటలో నిర్మిస్తున్న గోదావరి కరకట్ట పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రతి కుటుంబానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందించాలని మంత్రి స్పష్టం చేశారు. ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. బాధితులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వరద పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

# కంపెనీ సెక్రటరీల సదస్సు ప్రారంభం

- **50వ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సుకు శ్రీకారం**
- **పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణమే లక్ష్యం**
- **సదస్సును ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని కొండాపూర్ తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో భారత కంపెనీ సెక్రటరీల సంస్థ (ఐసీఎస్ఐ) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ దక్షిణ భారత ప్రాంతీయ కంపెనీ సెక్రటరీల సదస్సు-2026ను రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్షిణ భారత రాష్ట్రాల నుంచి హాజరైన కంపెనీ సెక్రటరీలను మంత్రి అభినందించారు. సదస్సులో దక్షిణ భారత రాష్ట్రాల నుంచి 700 మందికి పైగా కంపెనీ సెక్రటరీలు పాల్గొన్నారు. కార్పొరేట్ పాలనను బలోపేతం చేయడం, పారదర్శకతను పెంపొందించడం, చట్టపరమైన నిబంధనల అమలు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర ఎంతో కీలకమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన, పెట్టుబడిదారులకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సుస్థిర ఆర్థికాభివృద్ధి, కొత్త పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. వ్యాపార సంస్థల్లో సుపరిపాలన, నైతిక విలువలు, చట్టబద్ధమైన విధానాల అమలులో కంపెనీ సెక్రటరీల పాత్ర మరింత కీలకంగా మారిందని మంత్రి అన్నారు. వేగంగా మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని సంస్థల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా కార్పొరేట్ రంగానికి సంబంధించిన తాజా పరిణామాలు, సవాళ్లు, అవకాశాలపై విస్తృత చర్చలు జరిగే అవకాశముందని మంత్రి తెలిపారు. పరస్పర అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తిపరమైన సామర్థ్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సమావేశం విజ్ఞానాన్ని పెంపొందించే, ఫలవంతమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రముఖులు, కంపెనీ సెక్రటరీలు పాల్గొన్నారు.






# భూ బాధితులకు అండగా ఉంటా: ఈటల

- **అన్మత్‌నగర్, హయత్‌నగర్ భూ బాధితులతో భేటీ**
- **దళిత కుటుంబాల సమస్యలు విన్న ఈటల రాజేందర్**
- **న్యాయబద్ధమైన హక్కులు కల్పిస్తామని హామీ**
- **అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్న ఈటల**

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను శనివారం శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో అన్మత్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాలకు చెందిన భూ బాధితులు కలిసి తమ సమస్యలను వివరించారు. భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ, సుమారు 50 సంవత్సరాల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం పేద దళిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూములు కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తే అధికారులు, స్థానికంగా వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తాము దినసరి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, కనీసం నివసించేందుకు 100 గజాల స్థలం కూడా అందుబాటులో లేదని బాధితులు ఈటల రాజేందర్‌కు వివరించారు. కుటుంబ సభ్యులు మరణించినప్పుడు చివరి చూపు కోసం ఇంటి ముందు ఉంచుకునే స్థలం కూడా లేదని కన్నీటి పర్యంతమయ్యారు. భూ బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఈటల రాజేందర్, పేద దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాధితులకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులు, స్థలాలు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ఈటల పేర్కొన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా భూ బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని ఈటల రాజేందర్‌ను కోరగా, న్యాయపరమైన మార్గంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మీ సేవకు కొత్త రికార్డు

- ఒక్క రోజులో 2.20 లక్షల లావాదేవీలతో చరిత్ర
- దేశంలోనే నంబర్-1 డిజిటల్ సేవా వేదికగా మీ సేవ
- జూలై 31న అత్యధిక లావాదేవీలు నమోదు
- మీ సేవ బృందాన్ని అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక డిజిటల్ పౌర సేవా వేదిక 'మీ సేవ' మరో కీలక మైలురాయిని అధిగమించింది. జూలై 31న ఒక్కరోజే రికార్డు స్థాయిలో 2,20,172 లావాదేవీలు నమోదై మీ సేవ చరిత్రలోనే అత్యధిక రోజువారీ లావాదేవీలుగా నిలిచాయని రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు వేగవంతమైన, పారదర్శకమైన, ప్రజా కేంద్రిత సేవలు అందించాలనే లక్ష్యంతో మీ సేవ వేదికను నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సేవల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణ, వ్యవస్థ పనితీరు మెరుగుదల, కొత్త సేవల అనుసంధానం వల్ల ఈ ఘనత సాధ్యమైందని వివరించారు.

సాధారణంగా రోజుకు 70 వేల నుంచి 80 వేల వరకు లావాదేవీలు నమోదయ్యే మీ సేవలో ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు జరగడం డిజిటల్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి అన్నారు. ఆ రోజు అత్యధికంగా కుటుంబ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు నమోదయ్యాయని తెలిపారు. ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరిగినప్పటికీ ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా సేవలు అందించగలిగామని మంత్రి వెల్లడించారు. సమర్థత, విశ్వసనీయత, నిరంతర సేవల పరంగా మీ సేవ దేశంలోనే అగ్రశ్రేణి ప్రభుత్వ డిజిటల్ సేవా వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సేవలందించిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, సాంకేతిక బృందాలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. వారి సమిష్టి కృషి వల్లే ఈ రికార్డు సాధ్యమైందని ప్రశంసించారు. ప్రస్తుతం మీ సేవ ద్వారా కుటుంబ కార్డులు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ సేవలు, ప్రభుత్వ, విద్యుత్ తదితర బిల్లుల చెల్లింపులు, రవాణా శాఖ సేవలు సహా అనేక సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజాకేంద్రిత సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి తెలంగాణను డిజిటల్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలబెడతామని స్పష్టం చేశారు.




# గాంధీభవన్‌లో వీహెచ్ వినూత్న నిరసన

- అయోధ్య రామాలయ విరాళాల అంశంపై అవగాహన కార్యక్రమం
- నాటకం రూపంలో ఆరోపణల వివరణ
- గాంధీభవన్‌లో నిర్వహించిన వినూత్న నిరసన
- ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):**

అయోధ్య రామాలయ విరాళాల అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నాటకం రూపంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంపై తమ పార్టీ లేవనెత్తుతున్న అంశాలను నాటక రూపంలో ప్రదర్శించారు. ప్రజలకు తమ వాదనను కళారూపం ద్వారా వివరించే ప్రయత్నం చేశారు.

వీహెచ్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని అన్నారు.

గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజలు హాజరయ్యారు. నాటకం ద్వారా తమ అభిప్రాయాలను ప్రజలకు చేరవేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శాంతియుతంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యాయి.

# తల్లి పాలపై అవగాహన పెంచాలి

- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపు
- పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలని సూచన
- మొదటి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని అవగాహన కల్పించాలి
- అంగన్వాడీ, ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రచారం చేపట్టాలని ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేసేలా ఉద్యమంలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించి, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.

ఆరు నెలల తర్వాత వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి వివరించారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని మంత్రి కోరారు. ప్రతి ఆసుపత్రిలో ప్రసవం జరిగిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# నెహ్రూ జూపార్క్ చార్జీల పెంపు

- ఆగస్టు 1 నుంచి కొత్త రుసుములు అమలు
- ప్రవేశ టికెట్లతో పాటు సఫారీ చార్జీల పెంపు
- బ్యాటరీ వాహనాలు, టాయ్ ట్రైన్ ధరలు కూడా పెంపు
- జూపాట్ పాలకమండలి నిర్ణయంతో కొత్త ధరలు అమల్లోకి



**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే వారికి తెలంగాణ జూస్ అండ్ పార్క్స్ అథారిటీ (జూపాట్) కొత్త రుసుములను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రవేశ టికెట్లతో పాటు సఫారీ, బ్యాటరీ వాహనాలు, టాయ్ ట్రైన్ తదితర సేవల చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జూపార్క్ సందర్శన వ్యయం పెరగనుంది. కొత్త ధరల ప్రకారం పెద్దలకు ప్రవేశ టికెట్‌ను రూ.100 నుంచి రూ.120కు, పిల్లలకు రూ.50 నుంచి రూ.60కు పెంచారు. సందర్శకులను ఎక్కువగా ఆకర్షించే ఏసీ సఫారీ టికెట్ ధరను రూ.150 నుంచి రూ.165కు, నాన్ ఏసీ సఫారీ టికెట్‌ను రూ.100 నుంచి రూ.110కు సవరించారు.

జూపార్క్‌లో బ్యాటరీ వాహనాల్లో ప్రయాణించేందుకు పెద్దలకు టికెట్ ధర రూ.120 నుంచి రూ.135కు, పిల్లలకు రూ.70 నుంచి రూ.75కు పెరిగింది. టాయ్ ట్రైన్ టికెట్ ధరను పెద్దలకు రూ.80 నుంచి రూ.90కు, పిల్లలకు రూ.40 నుంచి రూ.45కు పెంచారు. ఫిష్ అక్వేరియం ప్రవేశ రుసుమును రూ.20 నుంచి రూ.25కు పెంచగా, రెప్టైల్ హౌస్ టికెట్‌ను పెద్దలకు రూ.30 నుంచి రూ.35కు, పిల్లలకు రూ.10 నుంచి రూ.15కు సవరించారు. నాక్టర్నల్ యానిమల్ హౌస్‌ను సందర్శించేందుకు పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15 చొప్పున రుసుము నిర్ణయించారు.

గత జూలై 13న అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన తెలంగాణ జూస్ అండ్ పార్క్స్ అథారిటీ 15వ పాలకమండలి సమావేశంలో ఈ ధరల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా సవరించిన రుసుములు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కొత్త రుసుములపై సందర్శకులు ముందుగానే అవగాహన కలిగి టికెట్లు కొనుగోలు చేయాలని జూపార్క్ అధికారులు సూచించారు. జంతు సంరక్షణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఈ చార్జీల సవరణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# గవర్నర్‌తో వ్యవసాయ శాఖ అధికారుల సమావేశం

- లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ
- ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి నేతృత్వంలో సమావేశం
- వ్యవసాయం, సహకార, ఉద్యాన శాఖల ఉన్నతాధికారుల పాల్గొనడం
- రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు సమాచారం



**హైదరాబాద్, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను శనివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ గిల్లెల్ల చిన్నారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు కూడా ఆయనతో కలిసి గవర్నర్‌ను కలిసి చర్చలు జరిపారు. డాక్టర్ గిల్లెల్ల చిన్నారెడ్డితో పాటు వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ ఎస్.కె. యాస్మీన్ బాషా ఈ భేటీలో పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై గవర్నర్‌తో అధికారులు చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వ్యవసాయం, ఉద్యానవనం, సహకార రంగాలకు సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రణాళికా అంశాలపై అధికారుల నుంచి గవర్నర్ వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. సంబంధిత శాఖల పురోగతిపై కూడా ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం.

ఈ సమావేశం మర్యాదపూర్వక భేటీగా జరిగినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు గవర్నర్‌కు వివరాలు అందజేశారు. ఈ భేటీలో పాల్గొన్న అధికారులు తమ తమ శాఖల కార్యకలాపాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలపై గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.

# అత్యవసర వైద్య సేవలకు ఎలక్ట్రిక్ విమానాలు..

- ఎయిరిండియా కీలక ఒప్పందం

**ముంబై, ఆగస్టు 1 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ఎగిరే, దిగే ఎలక్ట్రిక్ విమానాల (ఈవీటీఓఎల్) వినియోగానికి అడుగులు పడుతున్నాయి. ఈ దిశగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు ఎయిరిండియా, జపాన్‌కు చెందిన ఈవీటీఓఎల్ తయారీ సంస్థ స్కైడ్రైవ్, సుజుకీ మోటార్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

ఈ భాగస్వామ్యంలో స్కైడ్రైవ్ తన ఈవీటీఓఎల్ సాంకేతికతను, ఎయిరిండియా విమానాల నిర్వహణలోని నైపుణ్యాన్ని, సుజుకీ మార్కెట్ అనుభవాన్ని వినియోగించి అత్యవసర వైద్య రవాణా, మెడికల్ లాజిస్టిక్స్‌కు అవసరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నాయి.

దేశంలోని ప్రధాన నగరాలతో పాటు చిన్న పట్టణాల్లోనూ ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను వేగంగా ఆసుపత్రులకు తరలించడం, కీలక ఔషధాలు, వైద్య పరికరాలను సకాలంలో చేరవేయడం పెద్ద సవాలుగా మారింది. ఈవీటీఓఎల్ విమానాల వినియోగంతో ఈ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం లభించే అవకాశం ఉందని సంస్థలు భావిస్తున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే అత్యవసర వైద్య సేవల వేగం పెరగడంతో పాటు, దూర ప్రాంతాలకు కూడా తక్కువ సమయంలో వైద్య సహాయం అందించే అవకాశం ఏర్పడనుంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in